AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
17-11-2025 (Monday) MAIN EDITION

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఉరిశిక్ష



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆ దేశ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఉరిశిక్ష విధించింది. బంగ్లా అల్లర్లకు హసీనానే కారణమని కోర్టు దోషిగా తేల్చింది. బంగ్లాలో అల్లర్లు చెలరేగడంతో పదవికి రాజీనామా చేసి షేక్ హసీనా భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె భారత్‌లో తలదాచుకుంటున్నారు. అయితే బంగ్లా అల్లర్లలో పలువురు ప్రాణాలు కోల్పోగా, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. దీనిపై ఢాకాలోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ విచారణ చేపట్టింది. కేసులో హసీనాను దోషిగా తేల్చిన కోర్టు ఆమెకు మరణశిక్ష విధించింది.

## ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు 1,260 మంది ఎంపిక



**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్ :** ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు 1,260 మంది ఎంపికయ్యారు. ఈ మేరకు అధికారులు వివరాలు వెల్లడించారు. మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు గతంలో పరీక్ష నిర్వహించారు. సోమవారం బోర్డు జాబితా విడుదల చేయనుంది. తెలంగాణలో ఆరోగ్య సంరక్షణ సేవలకు పెద్ద ప్రోత్సాహాన్ని ఇస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో మొత్తం 1,284 పోస్టులను భర్తీ చేయడానికి గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది.

## లాభాల్లో ముగిసిన సూచీలు..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాన్ని లాభాలతో ప్రారంభించాయి. పీఎస్‌యూ బ్యాంకుల్లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఇటీవలి బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే విజయం ద్వారా విధాన నిర్ణయాలు కొనసాగింపు, మార్కెట్ స్థిరత్వానికి దోహదం చేస్తుందన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి.

## అందుకే జూబ్లీహిల్స్‌లో ఓటమి



**అక్షరటుడే, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆలస్యంగా అభ్యర్థిని ప్రకటించడం వల్లే ఓటమి పాలైనట్లు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మాత్రం గత ఆరు నెలల నుంచే ఎన్నికల కార్యాచరణ ప్రారంభించాయన్నారు. జూబ్లీహిల్స్‌లో ఓడినంత మాత్రాన బీజేపీ పని అయిపోయిందని మాట్లాడడం సరికాదన్నారు.

## హైదరాబాద్‌లో కుంగిన భవనం




**అక్షరటుడే, హైదరాబాద్ :** నగరంలోని గోషామహల్ చాక్నవాడిలో ఐదు అంతస్తుల భవనం కుంగిపోయింది. నూతన భవనం నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు. దీంతో దానిని ఆనుకొని ఉన్న ఐదు అంతస్తుల భవనానికి పెద్ద క్రాక్ వచ్చి కుంగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుని భవనంలో ఉన్న వాళ్లను ఖాళీ చేయించారు.

## గచ్చిబౌలిలో హైడ్రా కూల్చివేతలు..

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలో హైడ్రా అధికారులు సోమవారం కూల్చివేతలు చేపట్టారు. ఎఫ్‌సీఐ లేఅవుట్‌లో సంధ్య కన్వెన్షన్ యజమాని శ్రీధర్ అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. గచ్చిబౌలిలో సంధ్య కన్వెన్షన్ సమీపంలో సహకార గృహనిర్మాణ సంఘం లోపల అక్రమంగా నిర్మించిన భవనాలు, షెడ్లను అధికారులు గతంలో గుర్తించారు. హైకోర్టు తీర్పు మేరకు సోమవారం ఉదయం హైడ్రా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. పోలీస్ బందోబస్తు మధ్య నాలుగు అనధికార షెడ్‌లను, నిర్మాణంలో ఉన్న భవనాన్ని అధికారులు తొలగించారు.

## ఈడీ విచారణకు మరోసారి అనిల్ అంబానీ గైర్హాజరు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ మరోసారి ఈడీ విచారణకు గైర్హాజరయ్యారు. ఫెమా కేసులో ఈడీ ముందు నవంబర్ 14న విచారణకు రావాల్సి ఉండగా.. ఆయన హాజరు కాలేదు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతానని ఈడీని అభ్యర్థించారు. ఆయన విజ్ఞప్తిని తిరస్కరించిన ఈడీ.. సోమవారం విచారణకు హాజరుకావాలంటూ రెండోసారి సమన్లు జారీ చేసింది. సోమవారం సైతం అనిల్ అంబానీ విచారణకు దూరంగా ఉండడంతో మరోసారి సమన్లు జారీ చేస్తారా? లేదా? అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. బ్యాంకును మోసం చేసిన మనీ లాండరింగ్ కేసులో అనిల్ అంబానీకి ఈడీ సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే.



> సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. భారతీయ యాత్రికులతో వెళ్తున్న బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో 42 మంది సజీవ దహనం అయ్యారు. మృతుల్లో హైదరాబాద్ వాసులు 16 మంది ఉన్నట్లు సమాచారం. ఉమ్రా యాత్ర కోసం మక్కాకు వెళ్లి వస్తుండగా.. ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో బాధిత కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.
> –అక్షరటుడే, హైదరాబాద్

# మృత్యు యాత్ర

- సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం
- డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న భారత యాత్రికుల బస్సు
- 42 మంది సజీవ దహనం
- మృతుల్లో 16 మంది హైదరాబాద్ వాసులు

సౌదీ అరేబియాలో మక్కాను దర్శించడానికి భారత్‌కు చెందిన ముస్లింలు వెళ్తుంటారు. ఉమ్రా యాత్రలో భాగంగా ఎప్పుడైనా మక్కాకు వెళ్లొచ్చు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా అక్కడకు వెళ్లడానికి అవకాశం ఉంది. ఇందులో భాగంగా ఇటీవల భారత్ నుంచి పలువురు ఉమ్రా యాత్రకు బయలు దేరారు. వారు మక్కాను దర్శించుకొని మదీనాకు తిరిగి వస్తుండగా.. ఆదివారం అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో బస్సు ప్రమాదానికి గురైంది. యాత్రికుల బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 42 మంది సజీవ దహనం అయ్యారు. ఆ సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతులంతా భారతీయులేనని సమాచారం. ఇందులో హైదరాబాద్‌కు చెందిన 16 మందిని ఉన్నట్లు తెలుస్తోంది.

### ఈ నెల 9న బయలుదేరిన బృందం

హైదరాబాద్‌లోని మల్లెపల్లి, గోషామహల్‌కు చెందిన పలువురు నవంబర్ 9న ఉమ్రా యాత్రకు బయలు దేరారు. ప్రైవేట్ ట్రావెల్స్ ద్వారా వీరు యాత్రకు వెళ్లారు. మెహదీపట్నం ఫ్లైజోన్ ఏజెన్సీ ద్వారా నిర్వాహకులు టికెట్లు బుక్ చేశారు. విజయవంతంగా మక్కా యాత్ర పూర్తిచేసుకుని మదీనాకు వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన 16 మంది చనిపోయినట్లు గుర్తించారు. మరో ఇద్దరు సైతం మృతి చెందినట్లు తెలుస్తోంది. అయితే వివరాలు ఇంకా తెలియరాలేదు.

### మృతుల వివరాలు

రహీమున్నీసా, రహమత్ బీ, షెహనాజ్ బేగం, గౌసియా బేగం, కదీర్ మహ్మద్, మహ్మద్ మౌలానా, షోయబ్ మహ్మద్, సోహైల్ మహ్మద్, మస్తాన్ మహ్మద్, పర్వీన్ బేగం, జకియా బేగం, షౌకత్ బేగం, ఫర్హీన్ బేగం, జహీన్ బేగం, మహ్మద్ మంజూర్, మహ్మద్ అలీతో పాటు మరో ఇద్దరు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఒకే కుటుంబానికి 8 మంది, మరో కుటుంబానికి చెందిన 7 గురు ప్రమాదంలో చనిపోయినట్లు తెలుస్తోంది.

### ప్రధాని, సీఎం దిగ్భ్రాంతి

సౌదీ ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సౌదీ ఉన్నతాధికారులతో భారత సిబ్బంది నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ దుర్ఘటనపై విదేశాంగ శాఖ, సౌదీ ఎంబసీ అధికారులతో మాట్లాడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఘటనపై ఎప్పటికప్పుడు వివరాలు, సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ కుటుంబీకులు, బంధువులకు సమాచారం కోసం సచివాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ నంబర్ 79979 59754.

## దమ్ముంటే పట్టుకోమన్నాడు..
# అరెస్ట్ చేసి జైలులో వేశాం..



**అక్షరటుడే, హైదరాబాద్ :** ఐ బొమ్మ, బప్పం టీవీల నిర్వాహకుడు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. అంతకు ముందు ఆయనతో పలువురు నిర్మాతలు, సినీ ప్రముఖులు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భేటీ అయ్యారు. చిరంజీవి, నాగార్జున, రాజమౌళి, దిల్ రాజు, సురేశ్‌బాబు ఆయనను కలిసి వివిధ అంశాలపై చర్చించారు.
సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. పైరసీతో సినీ ఇండస్ట్రీకి తీవ్ర నష్టం జరిగిందన్నారు. దీంతో హైదరాబాద్ పోలీసులు, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ కలిసి పైరసీ ముప్పును అరికట్టాలనే సంకల్పంతో పని చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఐ బొమ్మ, బప్పం టీవీ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్ట్ చేశామని చెప్పారు. ఇమ్మడి రవి తెలుగు పరిశ్రమకు చాలా నష్టం చేశారన్నారు. ఆయనపై సైబర్ క్రైం పీఎస్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ఐబొమ్మ ద్వారా పైరసీతో తెలుగు చిత్ర పరిశ్రమకు నష్టం చేసిన రవి.. బెట్టింగ్ యాప్ ప్రమోషన్‌లు చేసి ప్రజలకు సైతం నష్టం చేశారని చెప్పారు. బెట్టింగ్‌కు బానిసలుగా మారి ఎంతో మంది ఆత్మహత్య చేసుకున్నారన్నారు.

### 21 వేల సినిమాలు

రవి ఒక వెబ్‌సైట్ బ్లాక్ చేస్తే మరోటి మిర్రర్ చేసేవాడన్నారు. దాదాపు 65 మిర్రర్ సైట్లు నిర్వహించాడని సీపీ తెలిపారు. ఆయన హార్డ్ డిస్కులను విశ్లేషించిన తర్వాత 21 వేల సినిమాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. 1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి మొన్న రిలీజ్ అయిన ఓజీ వరకు ఆయన హార్డ్ డిస్క్‌లో ఉన్నాయని చెప్పారు. ఐ బొమ్మ సైట్ ద్వారా రూ.20 కోట్లు సంపాదించినట్లు రవి చెప్పాడన్నారు. తాము రూ.3 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆయనను పోలీస్ కస్టడీకి తీసుకున్న తర్వాత మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని చెప్పారు.

### తక్కువ అంచనా వేయొద్దు

దమ్ముంటే పట్టుకోండి అని పోలీసులకు సవాల్ విసిరిన రవి ఇప్పుడెక్కడున్నాడని సీపీ ప్రశ్నించారు. హైదరాబాద్ పోలీసులను అంత తక్కువగా అంచనా వేయొద్దని హెచ్చరించారు. కాగా.. రవి భార్య సమాచారం ఇవ్వడంతో పోలీసులు పట్టుకున్నారని వచ్చిన వార్తలను సీపీ ఖండించారు. తామే నిఘా పెట్టి రవిని అరెస్ట్ చేశామన్నారు.

## తెలంగాణ స్పీకర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం..



**అక్షరటుడే, హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము ఇచ్చిన గడువులోగా అనర్హత పిటిషన్లపై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "ఎమ్మెల్యేల అనర్హతపై మీరు నిర్ణయం తీసుకుంటారా.. మమ్మల్ని తీసుకోమంటారా" అని ప్రశ్నించింది. బీఆర్ఎస్ నుంచి పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. వారిపై అనర్హత వేటు వేయాలని గతంలో బీఆర్ఎస్ నాయకులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం మూడు నెలల్లోపు చర్యలు చేపట్టాలని జులై 31న తీర్పు చెప్పింది. న్యాయస్థానం ఇచ్చిన గడువు అక్టోబర్ 31తో ముగిసింది. అయినప్పటికీ స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీ స్పీకర్‌పై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం ధర్మాసనం విచారణ చేపట్టింది. బీఆర్ఎస్ పిటిషన్ మేరకు తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా జవాబు చెప్పాలని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పీకర్‌ను ఆదేశించింది. రోజు వారీగా విచారణ జరిపి త్వరగా నిర్ణయం తీసుకోవాలని చెప్పింది.

## పాతికేళ్ల కుర్రాడితో డేటింగ్‌కి రెడీ..




కొన్ని సినిమాలు చేసినా స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్న బాలీవుడ్ హీరోయిన్ అమీషా పటేల్ మళ్లీ వార్తల్లో నిలిచారు. కొంతకాలం విరామం తీసుకున్న ఆమె సన్నీ డియోల్‌తో చేసిన 'గదర్ 2' భారీ విజయంతో తన రెండో ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టింది. ఇటీవల ఒక ప్రముఖ వ్యాపారవేత్తతో ఆమె డేటింగ్ చేస్తోందన్న టాక్ కూడా బాలీవుడ్ సర్కిల్స్‌లో హల్‌చల్ చేసింది. అయితే ఈ రూమర్లపై ఆమె ఇప్పటివరకు స్పందించలేదు. ఈ నేపథ్యంలో అమీషా తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో డేటింగ్-పెళ్లి అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "నా వయసుకు సగం ఉన్న కుర్రాళ్లు కూడా నాకు డేటింగ్ ఆఫర్లు ఇస్తుంటారు. నేను వాటిని సీరియస్‌గా తీసుకోను. కానీ మంచి వ్యక్తి అయితే ఏ వయసైనా ఓపెన్‌గా ఆలోచిస్తా" అని చెప్పింది. అలాగే,పెళ్లి విషయంలో నేను ఎప్పుడూ ఓపెన్‌గానే ఉంటాను. నా మనసుకు నచ్చిన వ్యక్తి దొరికితే వయసు ఏమాత్రం అడ్డంకి కాదు. ఏజ్ అనేది కేవలం ఒక నంబర్ మాత్రమే" అంటూ క్లారిటీ ఇచ్చింది. – అక్షరటుడే, సినిమా డెస్క్

## అమెరికా నుంచి ఎల్‌పీజీ దిగుమతి..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇంధన భద్రతను సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా నుంచి 'ఎల్‌పీజీ'ని దిగుమతి చేసుకునే దిశగా చరిత్రాత్మక ఒప్పందం కుదిరినట్లు కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ సోమవారం వెల్లడించారు. భారత ప్రజలకు అందుబాటు ధరలో ఎల్‌పీజీని అందించడంలో భాగంగా కీలక ముందడుగు పడిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో భారత పబ్లిక్ సెక్టార్‌లో ఉన్న చమురు కంపెనీలు అమెరికాతో ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. ఏడాది పాటు ఇది అమల్లో ఉంటుందని తెలిపారు. మొత్తం 2.2 ఎంటీపీఏ ఎల్‌పీజీని దిగుమతి చేసుకోనున్నామని వివరించారు. ఇది వార్షిక దిగుమతుల్లో 10 శాతానికి సమానని పేర్కొన్నారు. యూఎస్ గల్ఫ్ కోస్ట్ నుంచి ఈ ఎల్‌పీజీ రానుందని హర్దీప్ సింగ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## పెళ్లి వార్త చెప్పిన సాయిధరమ్ తేజ్..



**అక్షరటుడే, సినిమాడెస్క్:** టాలీవుడ్ హీరో సాయిధరమ్ తేజ్ తన వివాహంపై చివరకు ప్రకటన చేశారు. ఎంతోకాలంగా ఆయన పెళ్లి గురించి ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానులకు శుభవార్తను అందించారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడిన తేజ్.. వచ్చే ఏడాదిలో తన పెళ్లి జరుగుతుందని అధికారికంగా వెల్లడించారు. శ్రీవారిని దర్శించుకున్న తర్వాత ఆయన మాట్లాడుతూ.. "నాకు మంచి సినిమాలు, మంచి జీవితం ఇచ్చిన స్వామివారికి కృతజ్ఞతలు చెప్పేందుకే తిరుమల వచ్చాను. కొత్త సంవత్సరం రానున్న నేపథ్యంలో ఆయన ఆశీస్సులతో ముందుకు సాగాలని కోరుకుంటున్నా" అని చెప్పారు.